

చెరువులో గాలింపు

విషాదం

స్నానానికి దిగి తాళ్లపూడిలో ఐదుగురు.. బలివేలో ఇద్దరు.. వట్లూరులో ఇద్దరి మృతి

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో శివరాత్రి వేళ జరిగిన పలు ప్రమాదాలు ఆయా కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చాయి. తాళ్లపూడి మండలం తాడిపూడికి చెందిన ఐదుగురు యువకులు గోదావరిలో స్నానానికి దిగి మృతి చెందారు. లింగపాలెం మండలం తిమ్మక్కపాలేనికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు బలివే శ్రీరామలింగేశ్వరస్వామి దర్శనానికి వచ్చి తమ్మిలేరులో స్నానానికి దిగి నీటిలో మునిగి మృతి చెందారు. పెదపాడు మండలం వట్లూరు పెద చెరువులో స్నానానికి దిగిన పెదనాన్నను కాపాడేందుకు చెరువులోకి దిగిన తమ్ముడు కుమారుడు మునిగి ఇద్దరూ చనిపోయారు. బలివే, పట్టిసీమలో ఇద్దరు వ్యక్తులు గుండెపోటుతో మృతి చెందారు.

- వివరాలు మెయిన్, జిల్లా పేజీల్లో


● పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి..


● భీమవరం సోమేశ్వరస్వామి..


● పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామికి అభిషేకాలు..


● ప్రత్యేక పూజలందుకున్న బలివే రామలింగేశ్వరస్వామి


● పట్టిసీమలో గోదావరి పుణ్యస్నానాలు


వీరంపాలెంలో కలెక్టర్ నాగరాణి కుంభాభిషేకం

శివోహం.. శివోహం

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా హరినామ స్మరణతో శైవక్షేత్రాలు పులకించాయి. బుధవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రముఖ ఆలయా లు లక్షలాది మంది భక్తులతో కిటకిటలాడాయి. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 7లో..


● బలివేలో పుణ్యస్నానాలు


ఓటు వేసిన తర్వాత స్లిప్పును ఎలా మడవాలో వివరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

రండి ఓటేద్దాం

పట్టభద్రుల నియోజకవర్గంలో నేడు పోలింగ్..

సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం

ఎమ్మెల్సీ విజేత ఎవరు ?

- బ్యాలెట్ పత్రాలు.. బ్యాలెట్ బాక్సుల వినియోగం
- ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్..
- గుర్తింపు కార్డులు ఉంటేనే ఓటు వేసేందుకు అనుమతి
- స్వేచ్ఛగా ఓటేయండి.. ఆర్వో, కలెక్టర్ వెట్రిసెల్వి

ఉమ్మడి ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ నేడు జరగనుంది. అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అన్నింటిపై అవగాహన కలిగిన పట్టభద్రులే ఓటర్లుగా ఉన్నప్పటికీ ఎన్నికల అధికారులు మాత్రం ముందస్తుగా ఓటర్లకు సూచనలు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా సాగేలా ముందుచూపు ప్రదర్శించారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలిస్తారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నియోజకవర్గంలో 3 లక్షల 14 వేల 984 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే 42 వేల 282 మంది ఓటర్లు ఉండగా, వీరి కోసం 66 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ఆరంభమై సాయంత్రం నాలుగు గంటలతో ముగియనుంది. పోలింగ్ శాతాన్ని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు వెలువడ్డాయి.

వాస్తవానికి ఉభయ గోదావరి జిల్లాలో పట్టభద్రులైన ఓటర్లు 3 లక్షల 14 వేల 984 మంది ఉండగా వీరి నిమిత్తం 456 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వెబ్ కాస్టింగ్ సిద్ధం చేశారు. ఎన్నికలకు సంబంధించి 35 మంది పోటీలో ఉన్నారు. ఎన్నికల నిర్వహణ సాఫీగా సాగేలా 545 మంది ప్రిసైడింగ్ అధికారులు, 545 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 1080 మంది ఇతర పోలింగ్ సిబ్బంది, 544 మంది మైక్రో అబ్జర్వర్లతో కలిపి మొత్తం మీద రెండు వేల 714 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. ఏలూరు జిల్లాకు సంబంధించి 80 మంది పీవో, మరో 80 మంది ఏపీవో, 160 మంది అదనపు సిబ్బంది, 80 మంది అబ్జర్వర్లతో కలిపి మొత్తం మీద 400 మందిని నియమించారు. 70 మంది జోనల్ అధికారులను, 99 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. ఎమ్మెల్సీ ఓటింగ్‌కు సంబంధించి 1199 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. గురువారం పోలింగ్ జరగనుండడంతో జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి బుధవారం అధికారులతో మరోసారి సమీక్షించారు. ఎక్కడా లోపం జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. తగు నివేదికలను సిద్ధం చేసుకోవాలని నిర్దిష్ట ఆదేశాలు జారీ అయ్యాయి. పట్టభద్రుల ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని వెట్రిసెల్వి పిలుపునిచ్చారు.

అంతా టెన్షన్.. టెన్షన్

మూడు నెలలుగా ప్రత్యక్ష, పరోక్ష పద్ధతిలో ప్రచారం నిర్వహించిన అభ్యర్థులంతా నేడు తమ అదృష్టాన్ని పరిశీలించుకోబోతున్నారు. పోటీ పడుతున్న అభ్యర్థుల సంఖ్య భారీగా ఉండడమే కాకుండా ఈసారి ఓటర్ల సంఖ్య ఇదే మాదిరిగా పెరిగింది. ఇప్పుడున్న పరిస్థితుల అనుకూలతను బట్టి సుమారు 70 శాతం వరకు పోలింగ్ నమోదయ్యే అవకాశాలు లేకపోలేదని అధికారులు అంచనా వేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి పట్టభద్రుల ఓటర్లను ఒక చోటుకు రప్పించడం అంత సులువైన పనికాదని, ఈ కారణంగానే పోలింగ్ మందకొడిగా సాగడంతోపాటు శాతం తగ్గుముఖం పట్టగలదని ఇంకొంతమంది అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా తెలుగుదేశం పక్షాన పేరాబత్తుల రాజశేఖరం పోటీలో ఉండడంతో ఆయనకు అనుకూలతలు, బలహీనతలపైనే ఇప్పటి వరకు ఎవరంతట వారుగా అంచనాలు వేశారు. తెలుగుదేశం మాత్రం తమ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందుతారని ఇప్పటికే అంచనా వేసింది. ఇంకోవైపు పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు సైతం టీడీపీ అభ్యర్థికి గట్టి పోటీని ఇచ్చారు. ప్రచారం లోను ఏ మాత్రం తగ్గకుండా ముందుకే సాగారు. మిగిలిన అభ్యర్థులు నువ్వా నేనా అనే తరుణంలో ప్రచారాస్త్రాలు సంధించారు. పోటీలో ఉన్న అభ్యర్థులందరి వాదనలు విన్న పట్టభద్రుల ఓటర్లు ఏవైపు మొగ్గు చూపుతారనేదే ఇప్పుడు అందరిలోను టెన్షన్.. టెన్షన్.

మొత్తం అభ్యర్థులు : 35
ఓటర్లు : 3,14,984

● **బరిలో నిలిచింది వీరే**

పేరాబత్తుల రాజశేఖరం, కాట్రు నాగబాబు, షేక్ హుసేన్, కట్టా వేణుగోపాలకృష్ణ, కాండ్రేగుల నరసింహం, కాశ్లారి కృష్ణమోహన్, కుక్కల గోవిందరాజు, కునుకు హేమాకుమారి, కైలా లావణ్య, గౌతంబాబు కొల్లు, చిక్కాల దుర్గారావు, తాళ్లూరి రమేష్, దత్తాత్రేయ నోరి, దిడ్ల వీర రాఘవులు, దొరబాబు యాళ్ల, నీతిపూడి సత్యనారాయణ, పినిపే నాగభూషణవర్మ, పిప్పళ్ల సుప్రజ, పేపకాయల రాజేంద్ర, బొడ్డు శ్రీనివాసరావు, బొమ్మనబోయిన వీఎస్ఆర్ మూర్తి, బొమ్మిడి సన్నిరాజ్, బండారు రామ్మోహన్‌రావు, భీమేశ్వరరావు చిక్కా, మాకే దేవిప్రసాద్, మెర్ల శాస్త్రులు, మోకన అంబేడ్కర్, రాజపూడి, జేటీ రామారావు, రేవులగడ్డ ముఖేష్ బాబు, వానపల్లి శివగణేష్, ఎం.శ్రీనివాసరావు, శ్రీనివాస్ విష్ణువజ్ఝల, జీవీ సుందర్, హుసన్ షరీఫ్.


ఏలూరులో ఎన్నికల సిబ్బందికి సామగ్రిని ఇచ్చేందుకు వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

● **ఓటు వేసేందుకు వెళుతున్నారా..**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించే వారంతా ఈ జాగ్రత్తలు పాటించాలి. ఎన్నికల కమిషన్ నిర్దేశించినట్లు తగిన గుర్తింపు కార్డులను అందుబాటులో ఉంచుకుని పోలింగ్ సమయంలో అధికారుల ఎదుట ప్రదర్శించాలి. ఆధార్ కార్డు, పాన్‌కార్డు, దివ్యాంగుల సర్టిఫికెట్, ఓటరు గుర్తింపుకార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, డిపార్టుమెంట్ గుర్తింపు కార్డు, జాతీయ ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకులు, తపాల శాఖలో జారీ చేసిన ఫొటోతో ఉన్న పాస్‌బుక్, పెన్షన్ డాక్యుమెంట్‌ను ప్రతీ ఓటరు కలిగి ఉండాలి. ముందస్తుగా ఈ తరహా కార్డులు ఉన్నాయో లేదో సరిచూసుకుని ఆ తదుపరి పోలింగ్ కేంద్రానికి వెళ్లాలి.

● **మీ ఓటు చెల్లాలంటే..!**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు విధానం అందరూ అర్థం, అవగాహన చేసుకోవాలి. సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం బ్యాలెట్ పత్రాలను మాత్రమే పోలింగ్‌లో వినియోగిస్తారు. ఓటర్లకు ఒక బ్యాలెట్ పత్రాన్ని అందిస్తారు. ఈ పత్రంలో అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి. ఎన్నికల అధికారి ఇచ్చిన పెన్ మాత్రమే ఉపయోగించాలి. ప్రాధాన్యత క్రమంలో మీకు నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న గడిలో 1 అని అంకెను వేయాలి. ఆ తర్వాత ఇష్టమైన వారికి 2, 3, 4 ఈ తరహాలో ఓటు వేయవచ్చు. ఎట్టి పరిస్థితుల్లో ఒకే అంకెను(నెంబర్) ఇద్దరికి వేయకూడదు. అలా వేస్తే మీ ఓటు చెల్లదు. మరో ముఖ్య విషయమేమిటంటే బ్యాలెట్ పత్రంలో ఇష్టమైన అభ్యర్థికి 1 అంకె వేయకుండా ఆ తదుపరి 2, 3, 4 ప్రాధాన్యత క్రమంలో ఓటు వేస్తే అదీ కూడా చెల్లదు. బ్యాలెట్ పేపర్‌లో అంకెలు మాత్రం వేయాలి.



పోలింగ్ కేంద్రాలు.. నెంబర్లు

కుక్కునూరు జెడ్పీ హైస్కూల్ 249, వేలేరుపాడు జెడ్పీ హైస్కూల్ 250, జీలుగుమిల్లి జెడ్పీ హైస్కూల్ 251, బుట్టాయగూడెం జెడ్పీ హైస్కూల్ 252, 253, పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల 254, 255, కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల 262, 263, జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్ 264, 265, 266, 267, జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలికల హైస్కూల్ 268, 269, 270, టి.నర్సాపురం జెడ్పీ హైస్కూల్ 271, 272, చింతలపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల 273, 274, 276, చింతలపూడి ప్రభుత్వ హైస్కూల్ 275, లింగపాలెం జెడ్పీ హైస్కూల్ 277, 278, కామవరపుకోట జెడ్పీ హైస్కూల్ 279, 280, ద్వారకాతిరుమల ఎంపీపీ అప్పర్ ప్రైమరీ 281, 282, ద్వారకాతిరుమల ఎంపీపీ పాఠశాల 283, ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్ 318, 319, ఉంగుటూరు కమ్యూనిటీ హాలు 320, భీమడోలు ఎంపీపీ పాఠశాల 321, 322, భీమడోలు పంచాయతీ కార్యాలయం 323, పెదవేగి జెడ్పీ హైస్కూల్ 324, 325, పెదవేగి ఎంపీపీ స్కూల్ 326, 327, పెదపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల 328, 329 పెదపాడు ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాల 330, ఏలూరు గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల 331, 332, 333, 334, ఏలూరు కోట దిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 335, 335ఎ, 336, 336ఎ, ఏలూరు గుడివాక లంక ఎంపీపీ పాఠశాల 337, ఏలూరు అశోక్‌నగర్ ఎస్‌పీడీబీటీ కళాశాల 338, 339, ఏలూరు జేవియర్ ఇంగ్లీష్ హైస్కూల్ 340, 340ఎ, ఏలూరు జేవియర్ ప్రైమరీ స్కూల్ 341, 341ఎ, 342, ఏలూరు లక్ష్మీవారపుపేట ఎఆర్‌డీజీకే హైస్కూల్ 343, 344, 345, 346, దెందులూరు జి.హైమావతిదేవి జెడ్పీ హైస్కూల్ 347, 348, దెందులూరు ఎంపీపీ స్కూల్ 349, నిడమర్రు ఎస్‌జీజీకేఆర్ జెడ్పీ హైస్కూల్ 350.

ఎన్నికల సామగ్రి పంపిణీ

ఏలూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలోని 20 మండలాల్లో 66 పోలింగ్ కేంద్రాలకు 10 మంది జోనల్ అధికారులు, 14 మంది రూట్ అధికారుల పర్యవేక్షణలో 271 బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రి తరలించారు. ఏలూరు డివిజన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు కలెక్టరేట్ సమీపంలోని గిరిజన భవన్‌లోని పంపిణీ కేంద్రం నుంచి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్, ఇతర సామగ్రి తరలింపును ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ పర్యవేక్షణలో బుధవారం ఉదయం చేపట్టారు. పంపిణీ ఏర్పాట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి ఆకస్మికంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులకు ఎవరైనా హాజరు కాకపోతే వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు. ఓటు వేశాక బ్యాలెట్ పేపరును ఏ విధంగా మడిచి బాక్సులో వేయాలన్న దానిపై ఆమె సిబ్బందికి కొద్దిసేపు అవగాహన కల్పించారు. జంగారెడ్డిగూడెం డివిజన్‌కు సంబంధించి ఆర్డీవో కార్యాలయం నుంచి ఎన్నికల సామాగ్రి పంపిణీ జరిగింది.

కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఏలూరు జిల్లాలోని ఎనిమిది మండలాలు 21 పోలింగ్ కేంద్రాలకు నూజివీడు సబ్ కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఎన్నికల సామగ్రి పంపిణీ ఆర్డీవో స్మరణ్‌రాజ్ పర్యవేక్షణలో జరిగింది.

ఓటరు స్లిప్పుల గందరగోళం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల స్లిప్పుల పంపిణీలో సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో గందరగోళం నెలకొంది. గురువారం ఉదయం నుంచి పోలింగ్ జరగనుండగా బుధవారం మహాశివరాత్రి కావడంతో కొన్నిచోట్ల స్లిప్పుల కోసం ఓటర్లు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఓటర్లకు స్లిప్పులు అందించాల్సిన రెవెన్యూ సిబ్బంది పంపిణీలో జాప్యం జరిగింది. 30 శాతం ఓటర్ల స్లిప్పులు పంపిణీకి నోచుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. అధికారులను ప్రశ్నించగా ఓటర్ల స్లిప్పుల్లో సరైన అడ్రస్ లేని స్లిప్పులు పంపిణీ చేయలేకపోయామని మిగిలినవి పంపిణీ చేశామని చెబుతున్నారు.

ఓటర్ల నిరాశ..

- తాడేపల్లిగూడెంకు చెందిన సుబ్రహ్మణ్య శర్మ తనకు ఓటు ఉందంటూ తహసీల్దార్ కార్యాలయం వద్ద స్లిప్పు కోసం ఉదయం నుంచి వెతుకులాడాడు. తాజాగా ఓట్ల నమోదు సమయంలో ఎవరికీ ఆధారాలు ఇవ్వలేదని గతంలో ఉన్న ఓటు ఉంటుందని భావించడం వల్ల ఓటు కొత్తగా నమోదు చేసుకోలేదన్నారు. గతంలో మూడు సార్లు ఓటు వేశానని వాదించారు. ఆయనకు ఓటు లేదని తేల్చి చెప్పడంతో నిరాశగా వెనుతిరిగారు. ఈ ఓట్ల నమోదుపై సరైన ప్రచారం ఓటర్లకు సరైన అవగాహన కల్పించకపోవడం చాలా గందరగోళంలో ఉందని వాపోయారు.
- ఓట్లు వేసేందుకు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేసే పట్టభద్రులు అందరికీ సెలవు ఇవ్వాలని కలెక్టర్లు ఆదేశాలు జారీచేసినా కొన్ని సంస్థలు ఓట్లు వేసి వచ్చేయాలని నిర్వాహకులు చెబుతుండడంతో ఉద్యోగులు ఓట్లు వేసేందుకు అనుమతి ఇవ్వడం లేదని మండి పడుతున్నారు. ఇతర ప్రాంతాల కు వెళ్లి ఓట్లు వేయాలన్న చెబుతుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికల సామగ్రి తరలింపు

నిఘా నీడలో ఎన్నికలు

ఏలూరు క్రైం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ఏలూరు జిల్లాలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్ పర్యవేక్షణలో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లాలో 18 రూట్ మొబైల్స్ పోలీస్ బృందాలు, 10 స్ట్రైకింగ్ ఫోర్స్ పోలీసు బృందాలు, 4 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పోలీసు బృందాలు ఏర్పాటుచేశారు. ఎన్నికల బందోబస్తుకు నలుగురు డీఎస్పీలు, పది మంది సీఐలు, 34 మంది ఎస్ఐలు, 422 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు, హోం గార్డులను బందోబస్తులో వినియోగిస్తు న్నారు. ఎక్కడ ఎలాంటి అల్లర్లు జరుగకుండా ముందస్తుగా నిఘా బృందాలను రంగంలోకి దించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాంతాల్లోకి ఓటు లేనివారు ఎవరైనా వస్తే ముందస్తుగా కఠిన చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేశారు.



ఎన్నికల సామగ్రి తీసుకుని పోలింగ్ కేంద్రానికి వెళుతున్న సిబ్బంది


పట్టిసీమ ఆలయం వద్ద ఇసుక తిన్నెల్లో చలువ పందిర్లు


పాలకొల్లు క్షీరారామంలో భక్తుల రద్దీ


గునుపూడి సోమేశ్వరాలయంలో కిక్కిరిసిన క్యూలైన్


పట్టిసీమ వద్ద గోదావరిపై పంటులతో ఏర్పాటు చేసిన కాలిబాట వంతెన



హరోం హర

శైవ క్షేత్రాలు కిటకిట

మార్మోగిన శివ నామం

గునుపూడి సోమారామం

భీమవరం టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తుల తాకిడి కనిపించింది. క్యూలైన్‌లు భారీ ఉండడంతో ఎండలో ఉన్నవారు. అవస్థలు పడ్డారు. కాళ్లు కాలుతున్నా ఎండలో ఉండి స్వామి వారి దర్శనం చేసుకున్నారు. దాదాపు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారుల అంచనా. ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు పర్యవేక్షణలో తెల్లవారుజామున ఆలయ అర్చకులు కందుకూరి సోంబాబు, చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ధ్వజ స్థంభం వద్ద దీపాలను వెలిగించారు. డీఎస్పీ జయసూర్య, వన్ టౌన్ సీఐ అనాగరాజు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. ఆలయం మీదుగా వాహన రాకపోకలను మళ్లించారు. డిప్యూటీ స్పీకర్ రఘు రాకృష్ణరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. వీఐపీల పేరుతో భక్తుల తాకిడితో పలువురు అసహనం వ్యక్తం చేశారు.

భీమేశ్వరస్వామికి మహన్యాస పూర్వక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఈవో తోట శ్రీనివాస్ పర్యవేక్షణలో అర్చకులు పూజలు చేశారు.

పాలకొల్లు క్షీరారామం

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా పంచారామ క్షేత్రమైన క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం హరహర మహాదేవ శంభో శంకర.. శివ నామస్మరణతో హోరెత్తింది. తెల్లవారు జామున 4 గంటల నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. డిప్యూటి స్పీకర్ కె రఘురామకృష్ణరాజు, కలెక్టర్ సి.నాగరాణి, మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, ఎమ్మెల్యేలు తోట త్రిమూర్తులు, ఉదయభాను, నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు స్వామి వారిని దర్శించుకున్నారు ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు పర్యవేక్షణలో ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది, సమీప ఆలయాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కేడెట్లు, సత్యసాయి సేవా సంస్థలు సేవలందించారు. పట్టణ ఎస్ఐ కె.రజనీ కుమార్ ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు.

మాడ వీధుల్లో పాగా ఊరేగింపు

శ్రీశైలం, పాలకొల్లులో మాత్రమే మహాశివ రాత్రి రోజున అలంకరించే మల్లన్న పాగాను బుధవారం సాయంత్రం భక్తులతో కలిసి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. దగ్గులూరుకు చెందిన వరదా సోమేశ్వరరావు, రామకోటి మాణిక్యం దంపతులు 18 అడుగుల వెడల్పుతో 360 మూరల పాగా నేసి స్వామివారికి అందజేశారు. లింగోద్భవ సమయంలో ఆలయ గాలి గోపురం నుంచి ఆలయ శిఖరానికి పాగా అలంకరించనున్నారు.


బలివే రామలింగేశ్వర క్షేత్రం వద్ద తమ్మిలేరులో భక్తుల పుణ్యస్నానం


నరసాపురం వలంధర్ రేవులో స్నానమాచరిస్తున్న భక్తులు

ఆచంట రామేశ్వరస్వామి

ఆచంట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవ క్షేత్రం ఆచంటేశ్వరుడి ఆలయం భక్తుల శివ నామస్మరణతో హోరెత్తింది. వేకువ జామునే భక్తులో పుణ్యస్నానాలు ఆచరించి రామేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ఎమ్మెల్యే పితాని సత్యనారా యణ, అనంతలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి సత్యనారాయణ, ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ స్వామి వారి ప్రసాదం చిత్రపటం అందజేశారు.

వైభవంగా రథోత్సవం

ఆచంటేశ్వరుని రథోత్సవం వైభవంగా జరిగింది. పూలతో అలంకరించిన రథంపై స్వామి అమ్మవార్లు ప్రధాన వీధుల్లో తిరుగాడారు. వేల సంఖ్యలో భక్తులు రథాన్ని లాగడానికి ముందుకు వచ్చారు. సీఐ రాయుడు విజయకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరమణ పోలీసు బందోబస్తు నిర్వహించారు. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధనలో వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

వీరంపాలెం వీరేశ్వరస్వామి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం బాలాత్రిపుర సుందరిదేవి క్షేత్రంలో మహా శివరాత్రి సందర్భంగా భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఆత్మలింగానికి 12 నదీజలాలతో అభిషేకం నిర్వహించారు. మహా దేవునికి మహా కుంభాభిషేకం నిర్వహించారు. స్వామివారిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, తదితరులు మహాదేవునికి మహా కుంభాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఉమర్ ఆలీషా ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఆలయ ప్రాంగణంలో కూచిపూడి నృత్యాలు అలరించాయి. ఉదయం నుంచి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా క్యూలైన్‌లలో క్షేత్ర కార్యకర్తలు మంచినీరు అందించడంతో పాటు రుద్రాక్షలు, ప్రసాదాలు అందించారు.


ఆచంటలో వైభవంగా సాగిన రామేశ్వరస్వామి రథోత్సవం


బలివే రామేశ్వరస్వామి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు


ఆకివీడు వీరభద్రుడి సంబరంలో నోటిలో శూలాలతో యువకులు


పట్టిసీమ గోదావరి వద్ద పిండ ప్రదానం

పట్టిసీమ వీరేశ్వరుడు

పోలవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): శివ నామ స్మరణతో పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రం మార్మోగింది. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. తెల్లవారుజామున భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి పితరులకు పిండ ప్రదానం అర్పించి దీపపు తెప్పలు నదిలో వదిలారు. భక్తుల రద్దీతో క్యూలైన్లు, ఆలయ ప్రాంగణం, ఇసుక తిన్నెల్లో కాలినడక బాట, ఫెర్రీ రేవులు, స్నానాల ఘాట్‌లు, గోదావరిపై ఏర్పాటు చేసిన కాలినడక బాటలు నిండిపోయాయి. తెల్లవారుజామున ఆలయ వంశపారంపర్య ట్రస్టీలు కొచ్చర్లకోట వెంకట జగన్నాధరావు తదితరులు భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, ఫెర్రీ రేవు, ఇసుక తిన్నెల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఏర్పాటు చేసిన వాటర్ పాకెట్లు భక్తులకు ఉపయోగపడ్డాయి. ఇసుక తిన్నెల్లో 6 ఉచిత అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు. నదిపై రాకపోకలకు వేసిన పంట్లు, ఇసుక తిన్నెల్లో కాలినడక సౌలభ్యం కోసం వేసిన గోనె సంచుల బాట భక్తులకు ఉపశమనం కలిగించాయి. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నదిలో స్పీడు బోట్లతో నిరంతర పర్యవేక్షణ చేశారు. పోలవరం, కొవ్వూరు ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉత్సవ, భద్రతా ఏర్పాట్లను ఆర్డీవో ఎంవి.రమణ, డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ పర్యవేక్షించారు. లడ్డూ, పులిహోర ప్రసాదం కౌంటర్లు అదనంగా ఏర్పాటు చేశారు.

బలివే రామేశ్వరుడు

ముసునూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బలివే శ్రీ రామలింగేశ్వర స్వామి దర్శనానికి మహాశివరాత్రి పర్వదినాన భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం హరహర మహదేవ శంభో శంకర నామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజారుము స్వామివారికి మహారుద్రాభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ, విశేష పూజల అనంతరం 2గంటల నుంచి స్వామి వారి సర్వదర్శనం కల్పించారు. ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు రాజమండ్రి, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి లక్షమంది పైగా భక్తులు తరలివచ్చారు. పుణ్యస్నానాలు చేసే భక్తులతో తమ్మిలేరు జన సంద్రంగా మారింది. పితృదేవతలకు పిండప్రదానాలు చేసి, స్నానమాచరించి స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతో క్యూలైన్లు కిక్కిరిశాయి. స్వామి దర్శనానికి గంటల సమయం వరకు వేచి ఉన్నారు. ఆలయ ప్రాంగణంలో రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని సైతం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బాహ్య శివలింగానికి వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ పర్యవేక్షణలో డీఎస్పీ ప్రసాద్, సీఐ రామకృష్ణ, ఎస్ఐ ఎం.చిరంజీవి పటిష్ట బందోబస్తు నిర్వహించారు. సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్. ఉత్సవాల ప్రత్యేకాధికారి అనురాధ, నోడల్ అధికారి, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య తదితరులు భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా పర్యవేక్షించారు. స్వామివారి కల్యాణ మహోత్సవం అనంతరం తాత గుడి వద్దకు గ్రామోత్సవంగా వెళ్లి ఆశీస్సులు తీసుకుంటారని ఈవో సీతారామయ్య తెలిపారు.

ఊబిలో చిక్కుకున్న బాబాయ్, అబ్బాయ్

లభ్యంకాని ఆచూకీ


గాలింపు చర్యలు పర్యవేక్షిస్తున్న డీఎస్పీ

ఏలూరు క్రైం/పెదపాడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): చెరువులో స్నానానికి దిగి ఊబిలో కూరుకుపోయిన బాబాయ్‌ను రక్షించబోయిన అబ్బాయ్ కూడా ఊబిలో చిక్కుకున్నాడు. వారిద్దరూ కాపాడమని కేకలు వేసినా స్థానికులు నిస్సహాయంగా నిలబడిపోయారు. అగ్నిమాపక శాఖ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వట్లూరుకు చెందిన జిజ్జువరపు వెంకటేశ్వరరావు (50), అతని తమ్ముడి కుమారుడైన జిజ్జువరపు సుబ్రహ్మణ్యం (30) కుటుంబంతో కలిసి బుధవారం బలివే ఆలయానికి వెళ్లి మధ్యాహ్నం తిరిగి వచ్చారు. వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, మరికొంత మంది సాయంత్రం గ్రామంలోని చెరువుగట్టుపై కూర్చున్నారు. స్నానం చేస్తానని వెంకటేశ్వరరావు చెరువులోకి దిగి ఊబిలో దిగబడ్డాడు. బాబాయ్‌ను కాపాడుకోవాలని సుబ్రహ్మణ్యం కూడా దిగాడు. ఇద్దరూ ఒకరినొకరు పట్టుకుని ఊబిలో కూరుకుపోతూ కాపాడాలంటూ కేకలు వేశారు. స్థానికులు చూస్తుండగానే క్షణాల్లోనే నీటమునిగి పోయారు. సమాచారం అందుకున్న ఏలూరు జిల్లా అదనపు అగ్ని మాపక శాఖ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని గాలింపు చేపట్టారు. మరోవైపు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, త్రీటౌన్ సీఐ వి కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు, సిబ్బంది రాత్రి ఏడు గంటల వరకూ గాలింపు చేపట్టినా ఆచూకీ కానరాలేదు. చివరకు రెస్క్యూటీమ్ తమ ప్రయత్నాలను నిలిపివేసింది. బంధువులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని తమ వారి కోసం తల్లడిల్లిపోతూ రోదించడం చూపరులను కలచివేశాయి.

శివరాత్రి ఉత్సవాల్లో అపశ్రుతి — తమ్మిలేరులో మునిగి అన్నదమ్ములు మృతి

- మృతదేహాల వెలికితీత
- తిమ్మక్కపాలెంలో విషాదం


సంఘటనా స్థలి వద్ద అన్నదమ్ముల మృతదేహాలు, రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పెదవేగి/ముసునూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బలివే మహా శివరాత్రి ఉత్సవాల్లో విషాదం చోటు చేసుకుంది. తమ్మిలేరులో పుణ్యస్నానాల అనంతరం ఈత సరదా అన్నదమ్ములకు మృత్యుపాశమైంది. లింగపాలెం మండలం తిమ్మక్కపాలేనికి చెందిన పేరిచర్ల మారేష్, మంగమ్మ, వారి ఇద్దరు కుమారులు మునియ్య, మణి కుమార్, బంధువులతో కలిసి బుధవారం బలివే ఆలయం వద్ద తమ్మిలేరులో స్నానాలు చేసి దర్శనానికి బయలుదేరారు. మారేష్ కుమారులిద్దరూ కొద్దిసేపు స్నానంచేసి వస్తామన్నారు. దర్శనానికి వెళ్లి వచ్చిన తల్లిదండ్రులు కుమారులిద్దరూ రాకపోవడంతో జనంలో ఉన్నారేమోనని వెతు కుతు తమ్మిలేరు దగ్గరకు చేరుకున్నారు. ఇంతలో తమ్మిలేరు స్నానఘట్టాలకు ఎగువన మునిపల్లె సమీపంలో తమ్మిలేరు నీటిమడుగులో మృతదేహం ఉందనే సమాచారం తెలిసింది. అక్కడికి వెళ్లిన తల్లిదండ్రులకు చిన్న కుమారుడు మణి కుమార్ (18) మృతదేహం కనిపించడంతో హతాశులయ్యారు. మరో కుమారుడు ఎక్కడో చోట ఉన్నాడనే ఆశతో వెతుకుతుండగా నీటి మడుగులో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు పెద్ద కుమారుడు మునియ్య (20) మృతదేహం కూడా లభించింది. అప్పటివరకు కళ్లెదుటే ఆడుతూ, పాడుతూ ఉన్న ఇద్దరు కుమారులు విగతజీవులుగా కనిపించడంతో తల్లి మంగమ్మ, తండ్రి మారేష్, బంధువుల రోదనలతో విషాదం అలుముకుంది. దీనిపై కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ముసునూరు ఎస్ఐ తెలిపారు. ఒకపక్క పోలీసులు హెచ్చరిస్తున్నా పట్టించుకోకుండా తమ్మిలేరులో దిగడంతో వారు దుర్మరణం పాలయ్యారని అక్కడివారు చెబుతున్నారు. స్నాన ఘట్టాల సమీపంలో తమ్మిలేరు లోపకలికి వెళ్లనీయడంలేదని వారిద్దరు అక్కడకు కొద్ది దూరంలో ఎగువ భాగంలో నీటిలో దిగి, మృత్యుఒడికి చేరడం విషాదం.

గుండెపోటుతో ఇద్దరు..

పోలవరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. బుధవారం ఇసుక తిన్నెల్లో అన్నదానం నిర్వహించడానికి వచ్చిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు మండవల్ల నాగ వీరభద్రరావు(67) గుండెపోటుతో మృతి చెందారు. అన్నదాన సత్రం సమీపం నుంచి లఘుశంఖ తీర్చుకోవడానికి ఇసుక తిన్నెల్లో కొంతమేర నడిచి వచ్చిన ఆయన గుండెనొప్పితో కుప్పకూలిపోయారు. వైద్య సిబ్బంది సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.

బలివే ఆలయం వద్ద..

ముసునూరు: బలివే రామేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ఏలూరు టౌన్‌కు చెందిన బోర అన్నవరం (45) స్వామివారి దర్శనం అనంతరం ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. డాక్టర్ షకీనా ఇవాంజలి సీపీఆర్ చేసి, 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపించారు. అప్పటికే అన్నవరం మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

లక్ష్మీ గణపతికి పూజలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం సత్రంపాడులోని శ్రీలక్ష్మీ గణపతి స్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. స్వామిని వెయ్యి పెన్నులతో అలంకరించారు. అర్చకులు ఆర్.రాఘవేంద్రశర్మ పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులిచ్చి నివేదనలు సమర్పించారు. ఆలయ కార్యని ర్వహణాధికారి సి.హెచ్. చిననాగేశ్వరరావు, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

రేపు రౌండ్ టేబుల్ సమావేశం

ఏలూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పారి శుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి చేపట్టిన నిరసన కార్యక్రమాలకు మద్ద తుగా ఈ నెల 28న జంగారెడ్డిగూడెం పట్టణంలోని గౌడ కమ్యూనిటీ హాల్లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్ బుధవారం కోరారు.పట్టణంలోని రాజకీయపార్టీల ప్రతిని ధులు రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మద్దతునివ్వాలని విగ్నేష్ కోరారు.

శివోహం..


అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని


ఏలూరులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చంటి


లక్ష్మీపురం శివాలయం వద్ద పూజల దృశ్యం


ఏలూరులో విశేష అలంకరణలో చెన్నకేశవ స్వామి

నిడమర్రు / దెందులూరు / ఉంగుటూరు / ఏలూరు (జంగారెడ్డిగూడెం) / టి.నరసాపురం / కామవరపుకోట / పెదపాడు / పెదవేగి / ఏలూరు కార్పొరేషన్ / వేలేరుపాడు / కుక్కునూరు / కొయ్యలగూడెం / ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నిడమర్రు మండలంలో మందలపర్రు, పెదనింద్రకొలను, భువ్వనపల్లి, నిడమర్రు, ఛానమిల్లి, అడవికొలను గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మందలపర్రులోని ఉమా నీలకంఠేశ్వర పంచాయతన క్షేత్రంలో స్వామికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల కళ్యాణం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. దెందులూరు మండలం చల్లచింతలపూడిలోని దక్షిణ కాశీగా పేరు పొందిన శ్రీమేధా దక్షిణామూర్తి స్వామి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీరామవరంలో స్వామిని పలువురు భక్తులు దర్శించుకున్నారు. జోగన్నపాలెంలోని శ్రీయేగనాగలింగేశ్వర స్వామిని సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి, మాజీ సర్పంచ్‌లు పసుమర్తి ప్రభాకర్, మాజీ సహకార సంఘం బ్యాంకు అధ్యక్షుడు పసుమర్తి మధుబాబు దర్శించుకున్నారు. ఉంగుటూరులోని భీమేశ్వర స్వామిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గొల్లగూడెం, చేబ్రోలు,నారాయణపురం, రాచూరు, బొమ్మిడి గ్రామాల్లో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. కైకరంలో కోనా హనుమాన్ బాబు, జయకృష్ణ దంపతులు స్వామికి శాంతి కల్యాణం నిర్వహించారు. అలాగే గ్రామంలోని నాలుగు చోట్ల భారీగా అన్న సమారాధనలు నిర్వహించారు.టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెం, మల్లుకుంట గ్రామాల్లో మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీఅన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శ్రీభువనేశ్వరి సమేత చంద్రశేఖరస్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెం పట్టణంతో పాటు మండలంలోని తాడువాయిలో కొలువైన శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని బైనేరు, పేరంపేట రోడ్డు, జడ్పీ హైస్కూల్ వద్ద, పంచాయతీ రాజ్ కార్యాలయాల్లోని శివాలయాలను భక్తులు దర్శించుకుని శివుడికి అభిషేకాలు నిర్వహించారు. తాడువాయి శివక్షేత్రానికి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. డీఎస్పీ రవిచంద్ర, తహసీల్దారు కె.స్లీవజోజి స్వామిని దర్శించుకున్నారు. పెదవేగి మండలంలోని బలివే పుణ్యక్షేత్రం భక్తుల తాకిడితో పోటెత్తింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి తమ్మిలేరులో పుణ్య స్నానాలు చేసి బలివే రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బుధవారం తెల్లవారు జామునే బలివే చేరుకుని, చనిపోయిన తన తల్లిదండ్రులకు పిండప్రదానం చేశారు. స్వామిని దర్శించుకున్న వేలాది మంది భక్తులకు ఎమ్మెల్యే చింతమనేని అన్నప్రసాద వితరణ చేశారు. పెదవేగిలోని పురాతన శివాలయంలో అర్చకుడు తిప్పాభట్ల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాట్నాలకుంట, దుగ్గిరాల, జానంపేట, బి.సింగవరం, విజయరాయి, రామశింగవరం తదితర గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. కామవరపుకోటలోని శ్రీభద్రకాళీ సహిత వీరభద్రస్వామి, ఆడమిల్లిలోని మందా సమేత శనీశ్వరస్వామి, కంచికామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి, తడికలపూడిలోని గంగా పార్వతీ సమేత గాంగేశ్వర స్వామి, తాడిచర్లలోని దుర్గామల్లేశ్వరస్వామి, జీలకర్రగూడెంలోని ధర్మలింగేశ్వరస్వామి, తూర్పుయడవల్లి గ్రామాల్లోని శివాలయాల వద్ద భక్తులు శివరాత్రి పూజలు నిర్వహించారు. పెదపాడులోని శ్రీగంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. దేవాలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. స్వామికి విశేషాలంకరణ చేసి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలూరు దక్షిణపువీధిలోని మార్కండేయ స్వామి, జరాపహరేశ్వరస్వామి, అగ్రహారంలోని నగరేశ్వరస్వామి, పాత శివాలయం, పవరుపేటలోని కాశీ విశ్వేశ్వరస్వామి, పత్తేబాదలోని చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి, బావిశెట్టివారిపేట, నాగేశ్వరపురంలలోని కాశీ విశ్వేశ్వరాలయం, శివగోపాలపురంలోని శివాలయం, ఆదివారపుపేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత శివాలయంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రత్యేక పూజలు జరిపారు. సత్యనారాయణపేట కాలువ గట్టుపై గల శ్రీ గంగా పార్వతీ సమేత రేవులింగేశ్వరాలయంలో ఏకాదశ వార్షికోత్సవ మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఏకవార రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు వీరుబోట్ల వెంకటేశ్వరరావు, యాజ్ఞీక బ్రహ్మ వీరుబోట్ల కృష్ణవర్మ భక్తులతో పూజలు చేయించారు. గాంధీనగర్‌లోని అవిముక్తేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు శివరాత్రి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆరాధించారు. వేలేరుపాడు మండలంలోని శివ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. పవిత్ర గోదావరి నది ఒడ్డున ఉన్న రుద్రమ్మకోట, కటుకూరు, పేరంటాళ్ళపల్లి, శివాలయాలకు బక్తులు పోటెత్తారు. శివకాశీపురంలోని శివాలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కటుకూరులోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయాన్ని భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామికి పూజలు నిర్వహించారు. కుక్కునూరులోని శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామికి కౌండిన్యముక్తేశ్వర ఆలయానికి పెదరావిగూడెంలోని శ్రీపార్వతిసమేత కేదారేశ్వర స్వామి ఆలయానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. పెదరావిగూడెం, కౌండిన్యముక్తిలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. దాచారం గోదావరి తీరం నుంచి అవతలవైపు ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తరలి వెళ్లారు. గోదావరి నీటిమట్టం తగ్గిపోవడంతో గోదావరిలో నడుచుకుంటూ భక్తులు ఆలయానికి వెళ్లారు.


బలివేలో పిండ ప్రదానం క్రతువు దృశ్యం


వేలేరుపాడులో రుద్రమ్మకోట రుద్రకోటేశ్వర స్వామి

భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా భక్తులు దేవాలయాలు, నదులు, చెరువులు, కాలువల వద్దకు భారీ సంఖ్యలో తరలి వస్తున్నారని భక్తుల భద్రత దృష్ట్యా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కెపిఎస్ కిశోర్ సూచించారు. అధికారులు నిర్ణయించే ప్రదేశాల్లో మాత్రమే స్నానాలు చేయాలని, ఎక్కడబడితే అక్కడ స్నానాలు చేయడం ప్రమాదకరమని అలాంటి ప్రదేశాలకు వెళ్లకూడదన్నారు. నదులు, కాలువలు, చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.


దాచారం వద్ద గోదావరి దాటుతున్న భక్తులు


దెందులూరు శివాలయంలో పూజల దృశ్యం

ఇంటర్వ్యూ..

ఏడు గంటల నుంచే పోలింగ్

గెడ్డం ఎలీషా, తహసీల్దార్, కామవరపుకోట



• ఎమ్మెల్సీ ఎన్నికలకు చేసిన ఏర్పాట్లు ఏమిటి?

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు 27వ తేదీన జరగనున్నాయి. ఈ మేరకు రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

• ఎంతమంది ఓటర్లు ఉన్నారు?

జవాబు : 279వ పోలింగ్ కేంద్రంలో పురుషులు 377 మంది, మహిళలు 264 మంది ఉండగా, 280వ పోలింగ్ కేంద్రంలో పురుషులు 386 మంది, మహిళలు 230 మంది ఉన్నారు. ఇప్పటికే స్లిప్పులు అందజేశాం.

• సిబ్బందికి అవగాహన కల్పించారా?

జవాబు : ఎన్నికలు నిర్వహించే ఉద్యోగులకు శిక్షణ ఇచ్చాం. పటిష్టమైన బందోబస్తును నిర్వహిస్తాం. ఇప్పటికే మద్యం దుకాణాలను మూయించాం. ఎవరైనా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- కామవరపుకోట,(ఆంధ్రజ్యోతి)


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

వీఏపురం రోడ్డుకు మోక్షం

ఉంగుటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు నుంచి వి.ఎ.పురం గ్రామానికి గత పదేళ్లకు పైగా ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చొరవతో రూ.రెండు కోట్ల 40 లక్షలతో ఆరు కిలో మీటర్ల పొడవునా బి.టి. రహదారి నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం పనుల పురోగతిపై ఎమ్మెల్యే ధర్మరాజు పరిశీలించారు. ఉప్పాకపాడు, బొమ్మిడి, కాకర్లమూడి, వి.ఏ.పురం గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం అందుబాటులోకి రానున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు, టీడీపీ మండలాధ్యక్షులు పాతూరి విజయకుమార్ పాల్గొన్నారు.

బస్సు నుంచి జారిపడిన వృద్ధురాలి మృతి

పెదవేగి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : కూచింపూడిలో గత సోమవారం జరిగిన గంగానమ్మ జాతర ముగింపు వేడుకలకు వచ్చి, బస్సు ఎక్కే సమయంలో కిందపడి గాయపడిన వృద్ధురాలు అన్నవరం రమాదేవి (60) చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున మృతి చెందింది. పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటకు చెందిన అన్నవరం రమాదేవి వారి బంధువుల ఇంటికి కూచింపూడి వచ్చి, జాతర ముగిసిన తరువాత సోమవారం సాయంత్రం బస్సు ఎక్కడానికి ప్రయత్నించింది. కిక్కిరిసి ఉన్న జనం తొక్కిసలాట మధ్య ఆమె కిందపడి తీవ్రంగా గాయపడగా ఏలూరులో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున రమాదేవి మృతి చెందిందని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. కాగా ఈ సంఘటనలో బస్సు డ్రైవర్ జీవీ శాస్త్రులు నిర్లక్ష్యం కారణంగానే రమాదేవి మృతి చెందినట్టు నిర్ధారించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిజానికి బస్సు ఎక్కే సమయంలో జనం నెట్టేయడంతో ఆమె కిందపడి గాయపడినట్టు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. కానీ ఇప్పుడు డ్రైవర్‌ను బాధ్యుడిని చేస్తూ అతనిపై కేసు నమోదు చేయడం ఆశ్చర్యం కలిగిస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు.

కొయ్యలగూడెం వాసుల అన్న సమారాధన

కొయ్యలగూడెం, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలంలోని పట్టిసీమ పుణ్య క్షేత్రం వద్ద కొయ్యలగూడెం పట్టణానికి చెందిన విగ్గిన సూరిబాబు కుటుంబ సభ్యులు భారీ అన్నసమారాధన నిర్వహించారు. గుడికి వెళ్లి బయటకు వచ్చే అవుట్‌గేట్ వద్ద సమారాధన ఏర్పాటు చేశారు. దీంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నసమారాధనలో పాల్గొన్నారు. సుమారు 10వేల మందికి అన్న సమారాధన నిర్వహించినట్లు సూరిబాబు తెలిపారు.


వైఎంహెచ్ఏ హాలు, శనివారపుపేటలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు మండలంలో మార్మోగిన శైవ క్షేత్రాలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని బుధవారం ఏలూరు మండల కేంద్రంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ద్వారకాతిరుమల దత్తత క్షేత్రమైన శనివారపుపేటలోని చెన్నకేశ్వరస్వామి ఆలయంలో కొలువైన శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. లింగోద్భవ సమయంలో అభిషేకాలు, ప్రత్యేక మహాన్యాస రుద్రాభిషేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఏలూరు వైఎమ్‌హెచ్ఏ ప్రాంగణంలో స్ఫటిక లింగాన్ని ఏర్పాటుచేసి మహాకుంభమేళా జరుగుతున్న ప్రాంతం నుంచి నదిజలాలు తీసుకువచ్చి అభిషేకాలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని శివయ్యను ఆరాధించారు. చాటపర్రు, మాదేపల్లి తదితర గ్రామాల్లో శివాలయాల్లో పంచాక్షరిమంత్రం మార్మోగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు చేరుకుని దేవదేవునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

తాగునీటి ఎద్దడిలేకుండా ప్రణాళికలు : చంటి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) అన్నారు.దెందులూరులో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును బుధవారం ఎమ్మెల్యే చంటి పరిశీలించారు. గోదావరి కాల్వ నుంచి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకును మోటార్ల ద్వారా నీటిని తోడే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ రాబోయే 10, 15 రోజుల్లో పూర్తిస్థాయిలో చెరువులు నింపి రెండు గంటలు తాగునీరు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు, ఎంఈ సురేంద్రబాబు, ఏఈ సుబ్రహ్మణ్యం, వందనాల శ్రీనివాసరావు, ఆర్నేపల్లి తిరుపతి, పాల్గొన్నారు.


చెరువులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి

సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరించాలని ఆలిండియా సీనియర్ సిటిజన్స్ కన్ఫడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు వెంపరాల నారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఈ నెల 20, 23 తేదీల్లో ఆలిండియా సిటిజన్ కన్ఫడరేషన్ 22వ జాతీయ మహాసభలో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగాయి. మహాసభల్లో చేసిన తీర్మానాలను సీనియర్ సిటిజన్ కార్యాలయంలో నారాయణమూర్తి వివరించారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు రైల్లే ప్రయాణాల్లో ప్రయాణ రాయితీని పునరుద్ధరించాలన్నారు. కుటుంబ సభ్యులు వృద్ధులను సంరక్షించేలా బిల్లును సవరించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ అర్హత వయస్సు 70 నుంచి 60 సంవత్సరాలకు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో కన్ఫడరేషన్ జాతీయ కార్యదర్శి కుక్కునూరి రామచంద్రరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం

పోలింగ్‌కు సిద్ధమైన యంత్రాంగం - గుర్తింపు కార్డులు ఉండాలంటున్న అధికారులు


ఉంగుటూరులో పోలింగ్‌కు సిద్ధమైన యంత్రాంగం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురువారం జరిగే పోలింగ్ ప్రక్రియ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే అభ్యర్థుల ప్రచారపర్వం ముగిసింది. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహణకు అధికారులు సన్నద్ధమైయ్యారు. ఏలూరు రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 731మంది పట్టభద్రులు ఉన్నారు. పోలింగ్‌కు సంబంధించి మండలంలోని గుడివాకలంక గ్రామంలోని మండల పరిషత్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. 731 మంది పట్టభద్రులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికల సామాగ్రిని సంబంధిత అధికారులు సిబ్బందికి అందచేశారు.

కామవరపుకోట : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ గెడ్డం ఎలీషా తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో 279వ నెంబరు, 280వ నెంబర్లలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, మండలంలో పట్టభద్రులు 1257 మంది ఉన్నారని తెలిపారు. 279వ పోలింగ్ కేంద్రంలో పురుషులు 377 మంది, మహిళలు 264 మంది, 280వ పోలింగ్ కేంద్రంలో పురుషులు 386 మంది, మహిళలు 230 మంది ఉన్నారన్నారు. పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని, గుర్తింపు కార్డు ఉంటేనే పోలింగ్ కేంద్రానికి అనుమతిస్తామని తెలియచేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్, పోలీసు భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని తహశీల్దార్ వివరించారు.

టి.నరసాపురం : ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలో పోలింగ్‌కు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిటర్నింగ్ అధికారి సాయిబాబా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టి.నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 918 పట్టభద్రుల ఓటర్లకు రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

చింతలపూడి : ఎమ్మెల్సీ ఎన్నికల కోసం మండలంలో పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లు పూర్తయ్యాయని డిప్యూటీ తహసీల్దార్ షకీలున్నీసా తెలిపారు. మండలంలో 3వేల 31 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా వీరి కోసం నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మూడు కేంద్రాలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, ఒక కేంద్రం ప్రభుత్వ హైస్కూల్లో ఏర్పాటు చేశామన్నారు.

ఏలూరు : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు జంగారెడ్డిగూడెం డివిజన్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఆర్డీవో ఎం.వి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. జంగారెడ్డిగూడెంలో 7 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తామని డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు.

పెదపాడు : ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి పెదపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పోలింగ్ బూత్‌లు, పెదపాడు మెయిన్ ప్రాథమిక పాఠశాల వద్ద ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయగా, ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లుగా తహసీల్దారు కృష్ణజ్యోతి తెలిపారు. మూడు పోలింగ్ కేంద్రాల వద్ద పురుషులు 1194, మహిళలు 1060 మంది మొత్త 2254 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు.

బుట్టాయగూడెం : ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తహసీల్దార్ పి.వి.చలపతిరావు తెలిపారు. బుట్టాయగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 252, 253 నెంబర్లు గల రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. మండలంలో మొత్తం 1036 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 566కాగా స్త్రీలు 470మంది ఉన్నారన్నారు. గురువారం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీరంతా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు.

ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు చేసినట్టు ఇన్‌ఛార్జి తహసీల్దార్ పూర్ణచంద్ర వరప్రసాద్ తెలిపారు.ఉంగుటూరు హైస్కూల్లో రెండు,ఉంగుటూరు కమ్యూనిటీ హాల్లో ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఇందులో భాగంగా మండలంలో 1011 మంది పురుష ఓటర్లు, 619 మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.


జంగారెడ్డిగూడెంలో ఎన్నికల సామగ్రి పంపిణీ దృశ్యం

వైభవంగా నృశింహ మహాయజ్ఞం

ప్రతి ఏటా మహాశివరాత్రి రోజున ఏర్పాటు
సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి26(ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై కొలువైన శ్రీలక్ష్మీనరసింహుని ఆలయంలో అతిరుద్రప్రయోగ సహిత సుదర్శన నృశింహమహాయజ్ఞం కన్నులపండువగా జరిగింది. ఏటా మహాశివరాత్రి నాడు సాయంత్రం మొదలయ్యి తెల్లవార్లూ ఈ యజ్ఞాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీ. స్వయంభూవైన నరసింహస్వామికి ఈ యజ్ఞం జరపడం వల్ల లోకశాంతి చేకూరుతుందన్నది నమ్మకం.. హైదరాబాదుకు చెందిన కొచ్చర్లకోట నరసింహం ఆధ్వర్యంలో సిహెచ్ కుటుంబరావు యజ్ఞ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం విశేషకార్యక్రమాలు జరిగాయి. ఆలయ యాగశాల ప్రాంగణంలో రుత్వికులు సూర్యనమస్కారాలను నిర్వహించారు. అలాగే లక్ష తులసి పూజలు, శాలిగ్రామ అభిషేకాలు జరిగాయి. యజ్ఞక్రతువులో భాగంగా అభిషేకం నిమిత్తం 1331 కలశాలను వినియోగించారు. అలాగే పలువనమూలికలు, వివిధ రకాలద్రవ్యాలను యజ్ఞక్రతువుకు ఉపయోగించారు. తెల్లవార్లూ జరిగిన ఈ యజ్ఞక్రతువు భక్తులను అలరించింది.


శాలిగ్రామాలకు లక్ష బిల్వార్చన చేస్తున్న దృశ్యం

గిరిజన కళాకారులకు రూ.50 వేలు అందజేత

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : గిరిజన సంప్రదాయ కొమ్ము రేల నృత్య కళాకారులను ప్రోత్సహిస్తూ బుధవారం కామయ్యకుంటలో నృత్య బృందం లీడర్ కొమరం కన్నమ్మకు చిర్రి చారిటబుల్ ట్రస్ట్ తరపున 50 వేల రూపాయలను కుమారుడు హర్షవర్ధన్ చేతుల మీదుగా అందజేశారు. గిరిజన కళాకారులను ప్రోత్సహించి సంస్కృతీ, సాంప్రదాయాలను కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాదం కృష్ణ, సర్పంచ్ పెడకం విజయలక్ష్మి, ఎం.కన్నయ్య, ఎం.రమణ పాల్గొన్నారు.


నగదును గిరిజన కళాకారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

పదివేల మందికి పైగా భక్తుల రాక

పదివేల మందికి పైబడి భక్తులు బుధవారం పాదయాత్రగా చినవెంకన్న క్షేత్రానికి వచ్చారు. ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినాన శ్రీషిర్డీసాయి మందిరం నుంచి తెల్లవారుజామున 4గంటలకు వారంతా తమ యాత్రను ప్రారంభించారు. వారి రాకతో క్షేత్రం గోవింద నామస్మరణలతో మార్మోగింది. సాయంత్రం మరికొందరు సాయి రథంతో స్వామివారి ఆలయానికి చేరుకున్నారు.


పాదయాత్ర భక్తులకు అల్పాహారం అందిస్తున్న దాతలు


శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు


కైకలూరులో శ్రీపార్వతీసమేత శ్రీరామలింగేశ్వర, శ్రీరామేశ్వరస్వామివార్ల కల్యాణ మహోత్సవం

శంభో శంకర..


చాట్రాయి పెద్ద చెరువులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

- వైభవంగా శివరాత్రి మహోత్సవాలు
- శివపార్వతుల కల్యాణోత్సవాలను చూసి తరించిన భక్తజనం
- బలివే రామస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- జనసంద్రంగా మారిన తమ్మిలేరు
- పుణ్య స్నానాలతో పులకించిన ప్రధాన స్నాన ఘట్టాలు

ముదినేపల్లి /చాట్రాయి /కైకలూరు / మండవల్లి / ఆగిరిపల్లి / నూజివీడు టౌన్ / ముసునూరు / పిబరవరి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలోని శివాలయాల్లో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరిగింది. పెదగొన్నూరులోని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి, గురజ గ్రామంలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి, వడాలి గ్రామంలోని శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి దేవస్థానాల్లో దేవదాయశాఖ, ధర్మదాయ శాఖ అధికారులు స్వామివార్ల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకులు లంక వెంకటే శ్వరబాబు, ఐలూరి రామకృష్ణ, దండిబొట్ల నాగేశ్వరరావు కళ్యాణం, అభిషేకాలు నిర్వహించారు. గురజ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మాజీ సర్పంచ్ కామినేని వెంకటేశ్వరరావు దంపతులు కళ్యాణం, అభిషేకాలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారులు శింగనపల్లి శ్రీనివాసరావు, ఎస్.కె.కిషోర్ పర్యవేక్షణలో పెద్ద సంఖ్యలో భక్తులు శివరాత్రి పూజలు జరిపారు.అల్లూరు, కోడూరు, సింగరాయపాలెం శివాలయాల్లో కూడ శివరాత్రి పూజలు నిర్వహించారు. చాట్రాయిలోని పురాతన శ్రీఉమారామలింగేశ్వర క్షేత్రం భక్తులతో పోటెత్తింది. చుట్టుపక్కల మండలాలు, సరిహద్దున తెలంగాణ గ్రామాల నుంచి భక్తులు ఆర్టీసీ బస్సులు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలలో తరలిరావటంతో చాట్రాయి వీధులన్నీ జనంతో కిటకిట లాడాయి. భక్తులు పెద్ద చెరువులో పుణ్యస్నానాలు ఆచరించి పితృతర్పణలు సమర్పించి శ్రీఉమారామలింగేశ్వస్వామిని దర్శించుకున్నారు. అన్నసమారాధన నిర్వహించారు. ఆగిరిపల్లిలోని వరాహ పుష్కరిణి సమీపంలో శ్రీ బాలాత్రిపుర సుందరిసమేత ముక్తేశ్వర స్వామి ఆలయం, సత్రం సెంటర్లోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, శోభనాచలుని ఎగువ కొండపై స్వయంభు వెలసిన దుర్గాపార్వతీ సమేత మల్లికార్జున స్వామి ఆలయం, ఈదులగూడెంలోని నాగేశ్వర స్వామి ఆలయం, సురవరంలోని ముక్తేశ్వరస్వామి ఆలయం, కనసానపల్లిలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నూజివీడు దుర్గామల్లేశ్వర ఆలయం, కోటశివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నూజివీడు మండలం దిగవల్లి సరిహద్దున ఉన్న మల్లయ్యగట్టు తిరునాళ్ళకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా భక్తులు మెట్లపూజతో పాటు మోకాళ్ళతో మెట్లు ఎక్కి తమ మొక్కులను సమర్పించారు. ముసునూరు మండలం బలివే శ్రీ రామలింగేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు రాజమండ్రి, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి లక్షమంది పైగా భక్తులు తరలివచ్చారు. పుణ్యస్నానాలు చేసే భక్తులతో తమ్మిలేరు జనసంద్రంగా మారింది. తమ పితృదేవతలకు పిండప్రదానాలు చేసి, స్నానమాచరించి స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులతో క్యూలైన్లు కిక్కిరిశాయి. ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని సైతం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నూజివీడు డీఎస్పీ ప్రసాద్, సీఐ రామకృష్ణ, ఎస్ఐ ఎం.చిరంజీవిల అధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో సుమారు 20 వేలు మందికి చక్రపొంగళి, పులిహోర ప్రసాదాలను భక్తులకు అందజేశారు. మంత్రి స్వయంగా భక్తులు ప్రసాదాలను వడ్డించారు. ఏలూరు సత్యసాయి సేవా సమితి వాటర్, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. రామలింగేశ్వరస్వామిని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరరావు, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, నూజివీడు 15వ అదనపు సివిల్ జడ్జి నాగశైలజ తదితరులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.కైకలూరు మండలం ఆటపాకలో కొలువైన శ్రీభద్రకాళీవీరభద్ర సహిత సర్వమంగళ పార్వతీసమేత శ్రీరామలింగేశ్వర స్వామివారికి విశేష పూజలను నిర్వహించారు. నిత్య పాసన, బలిహరణ, సహస్రలింగార్చణ, ఏకాదశ రుద్రాభిషేకాలు, జ్యోతిర్లింగార్చన, జగజ్యోతిప్రజ్వలన వంటి పూజలను ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా జరిపారు. అలాగే కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో కొలువైన శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర, శ్రీరామేశ్వర స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించగా వేలాది మంది భక్తులు తరలి వచ్చి దర్శించుకున్నారు. రాత్రి స్వామివార్ల దివ్య కల్యాణమహోత్సవాన్ని అమ్మవారి కళావేదిక వద్ద ఉప్పులూరి ముత్తంరాజు దంపతులు, రాజశేఖర్ దంపతులు శాంతి కల్యాణమహోత్సవాన్ని శాస్త్రోత్తంగా వేలాదిమంది భక్తుల శివనామస్మరణాల మధ్యన కల్యాణాన్ని మేళతాళాలు, మంగలవాయిద్యాల నడుమ నిర్వహించారు. ఆలయాల అధికారి వీఎన్కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు. మండవల్లి మండలంలోని పలు శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండవల్లిలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో వేలాది మంది భక్తులు స్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అప్పాపురంలో స్వయంభూ శ్రీఅమృతాలింగేశ్వర స్వామి, లింగాలలో శ్రీగంగా విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, పుట్లచెరువులోని శ్రీకాశీవిశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి, అయ్యవారి రుద్రవరం, భైరవపట్నం గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.


పెదగొన్నూరులో మల్లేశ్వర స్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరుడు


పంచబుగ్గల కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


మండవల్లిలో విశ్వేశ్వరస్వామి

● స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే కామినేని

కలిదిండి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : శివరాత్రి సందర్భంగా కలిదిండిలోని పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి కళ్యాణం ఆలయ చైర్మన్ అడివి శివప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారు జాము నుంచి ఆలయం వద్ద ఉన్న పంచబుగ్గల కోనేరులో పుణ్యస్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మజ్జిగ సరఫరా చేశాయి. ఆలయ ఈవో శేఖర్ ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. నాగన్నచెరువు, అంజనాపురం, లోడిదలంక, పడమటిపాలెం, సానారుద్రవరం, గొల్లగూడెం గ్రామాల నుంచి ట్రాక్టర్లపై ప్రభలను ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు, టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, అగ్నికుల క్షత్రియ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ల డైరెక్టర్లు అంద్రాజు శ్రీనివాస్, లంకా రత్నారావు, డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు, కొల్లి బాబి, బీజేపీ నాయకులు చిట్టూరి రవీంద్ర, కోకా శ్రీనివాస్, అంకాల దుర్గా ప్రసాద్, సర్పంచ్ ప్రసన్న స్వామిని దర్శించుకున్నారు.


పాతాళ భోగేశ్వరస్వామి సన్నిధిలో కామినేని

నైతికతతో కూడిన విద్యాబోధన అవసరం : సెబాస్టియన్

ముదినేపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైతిక, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేందుకు విద్యా సంస్థల యాజమాన్యాలు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని విద్యావేత్త, సినీ ఆర్టిస్టు కె.వి.సెబాస్టియన్ అన్నారు. ముదినేపల్లిలోని ఇండోసాక్సన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో బుధవారం జరిగిన వార్షికోత్సవంలో పాల్గొన్న ఆయన విద్యా విషయక అంశాలను సమగ్రంగా వివరించారు. అకడమిక్ రికార్డుతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణతో కూడిన ప్రవర్తనను పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా గతేడాది పదవ తరగతి పరీక్షల్లో 600 మార్కులకు 588 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఈ స్కూల్ విద్యార్థి కాగిత ఈశ్వర్ చరణ్ తేజకు ప్రిన్సిపాల్ జార్జి ప్రకటించిన రూ.25 వేల నగదు అవార్డును సినీ ఆర్టిస్ట్ సెబాస్టియన్ అందజేశారు. స్థానిక ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ బి.శివ సూర్య నారాయణ పాల్గొన్నారు.


చరణ్ తేజకు నగదు అందజేస్తున్న దృశ్యం


ప్రార్థనలు చేస్తున్న ఫాదర్లు

శిలువగట్టు తిరునాళ్లు ప్రారంభం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి):ప్రముఖ క్రైస్తవ పుణ్యక్షేత్రం నూజివీడు శిలువగట్టు తిరునాళ్ల బుధవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. మూడురోజుల పాటు నిర్వహించే శిలువగట్టు తిరునాళ్ల కార్యక్రమాన్ని సమిష్ఠి బలిపూజ కార్యక్రమంతో రెవరెండ్ పాదర్ పంతగాని లాజర్ లాంఛనంగా ప్రారంభించగా, విచారణ గురువులు గొర్రుముచ్చు జోసఫ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, భక్తులకు దైవసందేశాలను అందించారు. ఈ సందర్భంగా శిలువగట్టుకు క్రైస్తవ విశ్వాసులు భారీగా తరలివెళ్లారు.

బలివే ఉత్సవాల్లో అపశ్రుతి

తమ్మిలేరులో గల్లంతైన ఇద్దరు యువకులు మృతి.. గుండె పోటుతో మరో వ్యక్తి మృతి


మృతదేహాలు వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ముసునూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బలివే ఉత్సవాల్లో బుధవారం అపశ్రుతి చోటు చేసుకున్నది. పెదవేగి మండలం నడిపల్లి గ్రామ శివారులో మునిపల్లి వద్ద తమ్మిలేరులో స్నానానికి దిగిన ఇద్దరు యువకులు గల్లంతై బలివే గ్రామ తమ్మిలేరులో విగతజీవులుగా తేలారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు మృతదేహాలను బయటకు తీశారు. మృతులు లింగపాలెం మండలం తిమ్మక్కపాలెంకు చెందిన పేరిచర్ల మునియ్య(20), పేరిచర్ల మణికుమార్(18)లుగా పోలీసులు గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు యువకులు ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు. అలాగే ఏలూరు టౌన్‌కు చెందిన బోర అన్నవరం (45) స్వామివారి దర్శనం చేసుకుని, బయటకు వచ్చే సమయంలో ఒక్కసారిగా కూప్పకూలాడు. వెంటనే వైద్యాధికారి షకీనా ఇవాంజలి అతనికి గుండెపోటు వచ్చినట్లు గుర్తించి, సీపీఆర్ చేసి, 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపగా, చికిత్స పొందుతూ అన్నవరం మృతి చెందాడు.

ఊబిలో చిక్కుకున్న బాబాయ్, అబ్బాయ్

లభ్యంకాని ఆచూకీ

ఏలూరు క్రైం/పెదపాడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): చెరువులో స్నానానికి దిగి ఊబిలో కూరుకుపోయిన బాబాయ్‌ను రక్షించబోయిన అబ్బాయ్ కూడా ఊబిలో చిక్కుకున్నాడు. వారిద్దరూ కాపాడమని కేకలు వేసినా స్థానికులు నిస్సహాయంగా నిలబడిపోయారు. అగ్నిమాపక శాఖ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వట్లూరుకు చెందిన జిజ్జువరపు వెంక టేశ్వరరావు (50), అతని తమ్ముడి కుమారుడైన జిజ్జువరపు సుబ్ర హ్మణ్యం (30) కుటుంబంతో కలిసి బుధవారం బలివే ఆలయానికి వెళ్లి మధ్యాహ్నం తిరిగి వచ్చారు. వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, మరికొంత మంది సాయంత్రం గ్రామంలోని చెరువుగట్టుపై కూర్చున్నారు. స్నానం చేస్తానని వెంకటేశ్వరరావు చెరువులోకి దిగి ఊబిలో దిగబడ్డాడు. బాబాయ్‌ను కాపాడు కోవాలని సుబ్రహ్మణ్యం కూడా దిగాడు. ఇద్దరూ ఒకరినొకరు పట్టుకుని ఊబిలో కూరుకుపోతూ కాపాడాలంటూ కేకలు వేశారు. స్థానికులు చూస్తుండగానే క్షణాల్లోనే నీటమునిగి పోయారు. సమాచారం అందుకున్న ఏలూరు జిల్లా అద నపు అగ్ని మాపక శాఖ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని గాలింపు చేపట్టారు. మరోవైపు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వర రావు, ఎస్ఐ రాంబాబు, సిబ్బంది రాత్రి ఏడు గంటల వరకూ గాలింపు చేపట్టినా ఆచూకీ కానరాలేదు. చివరకు రెస్క్యూటీమ్ తమ ప్రయత్నాలను నిలిపి వేసింది. బంధువులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని తమ వారి కోసం తల్లడిల్లిపోతూ రోదించడం చూపరులను కలచివేశాయి.



కైకలూరులో పోలింగ్ కేంద్రం వద్ద తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం.... ముదినేపల్లికి చేరుకున్న ఎన్నికల అధికారులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


చాట్రాయిలో జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సిబ్బంది


నూజివీడులో ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలింపు

కలిదిండి/ముదినేపల్లి/కైకలూరు/చాట్రాయి/ ముసునూరు/ నూజి వీడు టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కలిదిండి జడ్పీ హైస్కూల్లోని 16, 17 పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో మొత్తం 1,633 మంది ఓటర్లు ఉన్నారు. 16వ పోలింగ్ కేంద్రంలో 950 మంది ఓటర్లు, 17వ పోలింగ్ కేంద్రంలో 683 మంది ఓటర్లు ఓటు వేసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామకృష్ణ కోరారు. ముదినేపల్లి జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది బ్యాలెట్ పేపర్లతో బుధవారం సాయంత్రానికి ముదినేపల్లి చేరుకున్నారు. తహసీల్దార్ సుభానీ ఆధ్వర్యంలో పోలింగ్ నిర్వహణకు రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సిద్ధం కాగా, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వివిఎస్.వీరభద్రరావు పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కైకలూరులో 3 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఐదుగురు అధికారులు విధులు నిర్వహిస్తుండగా ఇద్దరు పోలీస్‌సిబ్బందిని సెక్యూరిటీ కోసం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఏర్పాట్లను తహసీల్దార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలవుతుందని, ఎక్కడా ఓటర్లు గుమిగూడి ఉండకూడదని సూచించారు. చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో గురువారం జరిగే పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ ప్రశాంతి తెలిపారు. మండలంలో 1538 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రానికి పోలింగ్ సిబ్బంది సామగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఓటు వేయటానికి వచ్చేటప్పుడు ఆధార్, పాన్ తదితర 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తీసుకురావాలని కోరారు. ముసునూరులో పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ కె.రాజ్ కుమార్ తెలిపారు. ముసునూరు జడ్పీపాఠశాలలో ఏర్పాటు చేసిన 11, 12 పోలింగ్ కేంద్రాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1339మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్ సీసీ కెమెరాల నిఘాలో జరుగుతుందని, 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ రెండు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. నూజివీడులో పోలింగ్ సామగ్రిని అధికారులు పోలింగ్ కేంద్రాలకు బుధవారం తరలించారు. నూజివీడు రూరల్ మండలం, మునిసిపల్ పరిధిలో గల దాదాపు 6,211 ఓటర్లకు గాను నూజివీడు రూరల్ మండల పరిధిలోని వారికి నూజివీడు బాలికోన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మునిసిపాలిటీ పరిధిలో గల గ్రాడ్యుయేట్ ఓటర్లకు నూజివీడు ఎస్.ఆర్.ఆర్ బాలుర ఉన్నతపాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, సంబంధిత పోలింగ్ సామగ్రిని నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారులు పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



సెంట్రల్ జోన్ ఖోఖో రన్నర్స్‌గా చిన్నంపేట సిద్ధార్థ



చాట్రాయి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఏలూరులో మంగళవారం జరిగిన సెంట్రల్ జోన్ జిల్లాస్థాయి ఆటల పోటీలలో మండలంలోని చిన్నంపేట సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థుల జట్టు ఖోఖోలో రన్నర్స్‌గా నిలిచారు. విజేతలైన విద్యార్థులను ప్రిన్సిపాల్ పలగాని శ్రీనివాసరావు అభినందించారు.



వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

చాట్రాయి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బూరుగుగూడెం పాత ఊరిలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం శ్రీగోవిందమాంబ సహిత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. 21 జంటలు పీటలపై కూర్చున్నారు. పండితులు కల్యాణ తంతు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గ్రంధాల జయప్రకాష్, మన్మధరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. గురువారం వీరబ్రహ్మేంద్ర స్వామి ఊరేగింపు జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరించాలని ఆలిండియా సీనియర్ సిటిజన్స్ కన్ఫడరేషన్ జాతీయ ఉపా ధ్యక్షులు వెంపరాల నారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఈ నెల 20, 23 తేదీల్లో ఆలిండియా సీటిజన్ కన్ఫడరేషన్ 22వ జాతీయ మహాసభలో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగాయి. మహాసభల్లో చేసిన తీర్మాణాలను సీనియర్ సిటిజన్ కార్యాలయంలో నారాయణమూర్తి వివరించారు. ఆయన మాట్లాడుతూ సీని యర్ సిటిజన్లకు రైల్లే ప్రయాణాల్లో ప్రయాణ రాయితీని పునరుద్ధరించాలన్నారు. కుటుంబ సభ్యులు వృద్ధులను సంరక్షించేలా బిల్లును సవరించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ అర్హత వయస్సు 70 నుంచి 60 సంవత్సరాలకు తగ్గించాలన్నారు. కార్యక్ర మంలో కన్ఫడరేషన్ జాతీయ కార్యదర్శి కుక్కునూరి రామచంద్రరావు పాల్గొన్నారు.

28న రౌండ్‌టేబుల్ సమావేశం

ఏలూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పారి శుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కా రానికి చేపట్టిన నిరసన కార్యక్రమాలకు మద్ద తుగా ఈ నెల 28న జంగారెడ్డిగూడెం పట్ట ణంలోని గౌడ కమ్యూనిటీ హాల్లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్ బుధవారం కోరారు.